సాక్షి
రంగారెడ్డి
బుధవారం, 28, ఆగస్టు, 2024



అప్పు చేసి..

రియల్ వ్యాపారం మోజులో అధిక లాభాలు పొందొచ్చని భ్రమ పడిన రైతులు, వ్యాపారులు వడ్డీలకు కుదేలవుతున్నారు. 8లో▸



అంధులకు చూపునిద్దాం

నేత్రదానంపై అపోహలు వీడి.. అంధులకు చూపునిచ్చేందుకు ముందుకు రావాలని లయన్స్‌క్లబ్ ప్రచారం నిర్వహిస్తోంది. 8లో▸



కారులో వచ్చి..

అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. కారులో వచ్చి రోడ్ల పక్కన పార్కు చేసిన వాహనాల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. 8లో▸

న్యూస్‌రీల్

అర్హులందరికీ రుణమాఫీ

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



మొయినాబాద్ రైతు వేదికలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

మొయినాబాద్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. రుణమాఫీ కాని రైతులు పలు సందేహాలను దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక లోపంతోనే కొందరివి ఆలస్యం అవుతోందన్నారు. మాఫీ కాని వారు వ్యవసాయాధికారుల వద్ద ఆన్‌లైన్‌లో చెక్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు కుమార్, సునీల్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ఇబ్రహీంపట్నంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంఈసీ గ్రూపులో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ప్రిన్స్‌పాల్ వరూధిని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ 6, ఎస్సీ సీ 01, బీసీ 3, మైనార్టీ, ఓసీలకు ఒక్కోటి చొప్పున ఖాళీ ఉన్నట్లు చెప్పారు. 10వ తరగతిలో 8జీపీఏ పైన మార్కులు సాధించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

నాలా నిధులు అడ్డుకోవడం సరికాదు



నబీల్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితా రెడ్డి

పహాడీషరీఫ్: ఎస్ఎన్‌డీపీ నాలా నిధులను అడ్డుకోవడంతోనే కొత్తపేట నబీల్ కాలనీలో పనులు ముందుకు కదలని పరిస్థితి నెలకొందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా రెడ్డి అన్నారు. మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్‌తో కలిసి ఆమె మంగళవారం నబీల్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులు రాకపోవడంతో పనులను మధ్యలోనే వదిలేశారన్నారు. ఇక్కడి ప్రజలు నిత్యం దుర్భర జీవితాలను అనుభవిస్తుండడాన్ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి నాలాను అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వాణిరెడ్డి, ఎస్ఎన్‌డీపీ అధికారులు, బీఆర్ఎస్, మజ్లిస్ కైసర్ బామ్, షర్ఫుద్దీన్ హామెద్, షేక్ అఫ్జల్, అహ్మద్ కసాది, హసన్ షా తదితరులు పాల్గొన్నారు.

కరాటే, కుంగుఫూలో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: ఎల్బీస్టేడియంలో ఇటీవల నిర్వహించిన 35వ జాతీయ స్థాయి కరాటే కుంగుఫూ చాంపియన్ షిప్–2024 పోటీల్లో సరూర్‌నగర్‌లోని లయోలా పాఠశాల విద్యార్థులు పది బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ మహమ్మద్ ఇస్తియాక్ గుల్షాన్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నామని అన్నారు. పాఠశాల దశ ఎంతో కీలకమైందని, ఎంచుకున్న మార్గం వైపు అడుగులు వేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కొడటి హర్షిత, అకడమిక్ ఇన్‌చార్జి ఉదయరాణి, కరాటే మాస్టర్ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆరోగ్యరక్ష

'సీజనల్‌వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. వ్యాధి వచ్చాక ఆస్పత్రులకు పరుగులు తీసేకంటే ముందు జాగ్రత్తలు పాటించడం మేలు. వ్యాధి లక్షణాలుంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.' అని చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌కు విశేష స్పందన లభించింది. పలువురు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సూచనలు, సలహాలు చేశారు. – చేవెళ్ల

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

- పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలి
- లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి
- చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



ఫోన్‌లో సలహాలు, సూచనలు చేస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్



చికున్‌గున్యా ఎలా వస్తుంది.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. లక్షణాలు ఎలా గుర్తించాలి?

– విజయ్‌కుమార్, పామెన

డాక్టర్: చికున్‌గున్యా దోమలతో వస్తుంది. ఇది కూడా విషజ్వరాల్లో ఒకటి. జర్వంతో మొదలై కీళ్ల నొప్పులు విపరీతంగా ఉంటాయి. నడవడానికి, కూర్చొని లేవడానికి ఇబ్బందిగా ఉంటుంది. పరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తారు. వైద్యులను సంప్రదించించి తగిన చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకోవాలి.

డెంగీ వ్యాధిని ఎలా గుర్తించాలి.. ఎలాంటి లక్షణాలు ఉంటాయి?

– రవి, మల్లారెడ్డిగూడ

డాక్టర్: డెంగీ అనేది సీజనల్ వ్యాధుల్లో ఒకటి. జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి, కళ్ల లాగడం లాంటి లక్షణాలు ఉంటాయి. జర్వం మూడురోజులకు మించి ఉంటే ఈ లక్షణాలు బయటపడతాయి. డెంగీ కిట్స్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చు. డెంగీతో జాగ్రత్తగా ఉండాలి. ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ప్రమాదకరంగా మారుతుంది.

డెంగీ జ్వరానికి ప్రభుత్వ ఆస్పత్రిలో తగిన వైద్యం అందిస్తారా.. లేదంటే పెద్ద ఆస్పత్రులకు పంపిస్తారా?

– వెంకటేశ్, ఆలూరు

డాక్టర్: డెంగీ జ్వరంతోపాటు సీజనల్ వ్యాధులకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయి. తీవ్రతను బట్టి వైద్యం అందిస్తారు. ప్లేట్‌లెట్స్ తక్కువగా నమోదవుతుంటే మాత్రం పెద్దాస్పత్రికి పంపించడం జరుగుతుంది.

విషజర్వాలతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– మాదవ్‌గౌడ్, కమ్మెట, కృష్ణారెడ్డి, దేవునిఎర్రవల్లి

డాక్టర్: ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో పారిశుద్యం లోపించి గ్రామాల్లో ఎక్కువగా విషజ్వరాలు ప్రబలుతుంటాయి. వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇళ్లలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మూత ఉన్న దాంట్లో వేసుకోవాలి. నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం, వాంతులు, నొప్పులు లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

దోమల బెడద ఎక్కువగా ఉంది. వ్యాధులు వస్తాయనే భయం ఉంది. జ్వరాలు రాకుండా ఏం చేయాలి?

– రమేశ్, గొల్లపల్లి

డాక్టర్: ముందుగా మీ గ్రామంలో పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయండి. గ్రామంలో పారిశుద్యం బాగుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. సీజనల్ వ్యాధుల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దు. వ్యాధి వ్యాప్తి చెందకముందే తగిన జాగ్రత్తలు పాటించాలి.

డెంగీ చికిత్స పొంది ఇంటికి వచ్చిన వారు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

– కె.రవి, దేవునిఎర్రవల్లి

డాక్టర్: డెంగీ జ్వరంతో చికిత్స పొందిన వారు తప్పనిసరి 15 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి, వ్యక్తిగత శుభ్రత పాటించాలి. జ్వరం తగ్గింది కదా అని పనులు చేసుకోవటం లాంటివి చేస్తే అప్పుడే తీవ్రత చూపిస్తుంది.

డెంగీ జ్వరం వస్తే ప్లేట్‌లెట్స్ పడిపోతాయి అంటారు. ఎంత సంఖ్యలో ఉండాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– నర్సింలు, ఆలూరు, యాదయ్య, పామెన

డాక్టర్: డెంగీ జ్వరం మామూలుగానే వస్తుంది. మూడునాలుగు రోజులకు మించి ఉంటే డెంగీ కిట్స్ ద్వారా నిర్ధారణ చేస్తారు. డెంగీ అని తెలితే తగిన వైద్యం అందిస్తారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తుండాలి. ప్లేట్‌లెట్స్ తగ్గుతూ, పెరుగుతూ ఉంటాయి. 10 వేల కంటే తక్కువగా ఉన్నాయంటే పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు. తగిన విధంగా చికిత్స పొందుతూ వైద్యుల పర్యవేక్షణలో ఉండాలి.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారా?

– శిరీష, తంగడపల్లి

డాక్టర్: చేవెళ్ల ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. టైఫాయిడ్, ప్లేట్‌లెట్ సంఖ్య, అన్నిరకాల రక్త పరీక్షలు చేస్తున్నాం. ఇతర పరీక్షలకు కూడా నమూనాలు సేకరించి వికారాబాద్ ల్యాబ్‌కు పంపించి ఫలితాలు తెప్పిస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు చేయించుకోవచ్చు.

విష జర్వాలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

– గోపాలకృష్ణ, చేవెళ్ల

డాక్టర్: సీజనల్‌గా వచ్చే విషజ్వరాలతో జాగ్రత్తగా ఉండాలి. ప్రధానంగా దోమలబారిన పడకుండా చూసుకోవలి. నీళ్ల నిల్వ ఉండకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. డెంగీ దోమ పగలు మాత్రమే కుడుతుంది. మోకాళ్ల కిందే ఈ దోమ కుట్టే ప్రమాదం ఉన్నందున నిండుగా ఉండే దుస్తులనే వేసుకోవాలి. దోమ తెరలు, దోమలు కుట్టకుండా ఇళ్లలో కాయిల్స్ లాంటివి వినియోగించాలి.



చందన చెరువు వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా ఏఈ మల్లికార్జున్

చెరువులను కాపాడండి

కలెక్టర్‌కు వినతి

మీర్‌పేట: కార్పొరేషన్‌లో కబ్జాలకు గురైన మూడు చెరువులను కాపాడాలని కోరుతూ 12వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రావత్ రవినాయక్ మంగళవారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. పెద్దచెరువు, చందన చెరువు, మంత్రాల చెరువుల బఫర్‌జోన్లను, కబ్జాదారుల ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. దీంతో పాటు నాలాలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్పొరేటర్ ముత్తంగి కరుణానిధి, స్థానిక బీజేపీ నాయకులు రవినాయక్, చెవ్వ శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

చెరువులను పరిశీలించిన హైడ్రా ఏఈ..

చెరువులను రక్షించాలని ఇటీవల వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం హైడ్రా ఏఈ, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెంబర్ మల్లికార్జున్ సిబ్బందితో కలిసి మీర్‌పేటలోని మూడు చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌తో పాటు ప్రభుత్వ స్థలాల వివరాలు సేకరించారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేష్

శంషాబాద్ డీసీపీ రాజేష్

షాద్‌నగర్: గణేశ్ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ అధికారులకు సూచించారు. వినాయక చవితి ఉత్సవాలకు పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వంతో ముందుకు సాగాలన్నారు. గణేశ్ మండపాల వద్ద ఎప్పటికప్పుడు పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి మండపం వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు విధిగా పోలీసుశాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జనం కోసం అధికారులు చెరువులను గుర్తించి అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఏఓ జ్యోతి, ఎస్ఎస్ఓ జగన్, పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సుశీల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనోత్సవానికి మంగళవారం శంషాబాద్ డీసీపీ రాజేష్ చెరువులను పరిశీలించారు. పట్టణ సమీపంలోని బొబ్బిలి చెరువుతో పాటు మండల పరిధిలోని బుచ్చిగూడ చెరువును పరిశీలించి ఆయా చెరువుల్లో నీటి సామర్థ్యం, నిమజ్జనానికి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

వైద్యుడి వక్రబుద్ధి

పహాడీషరీఫ్: నర్సుతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వైద్యుడిపై కేసు నమోదైంది. వివరాలివీ.. కందుకూరులోని లిమ్స్ ఆస్పత్రిలో ఓ యువతి (19) చదువుకుంటూనే నర్సుగా పని చేస్తోంది. ఇదే ఆస్పత్రిలో మార్కండేయ వైద్యుడిగా కొనసాగుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటికెళ్లేందుకు సిద్ధమైన యువతిని.. తానూ అదే మార్గంలో వెళ్తున్నానని, డ్రాప్ చేస్తానని చెప్పి కారులో ఎక్కించుకున్నాడు. అనంతరం డబుల్ మీనింగ్ డైలాగులతో మాట్లాడటం ప్రారంభించాడు. మౌనంగా భరించిన యువతి బాలాపూర్ వద్ద కారు దిగింది. ద్వంద్వ అర్థాలతో తనను ఇబ్బంది పెట్టిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పహాడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'భూామ్' అంతంతే..!

- తగ్గుతున్న స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు
- పదేళ్లుగా ఇదే పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ విశ్వనగరంగా విస్తరిస్తున్నా.. అంతర్జాతీయ స్థాయిలో భారీ పెట్టుబడులతో ఐటీ, ఫార్మా సంస్థలు కొత్తగా నెలకొంటున్నప్పటికీ స్థిరాస్తి రంగం పరిస్థితి మాత్రం ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం కూడా ఆశించినంత స్థాయిలో స్థిరాస్తి దూకుడు లేకుండా పోయింది. గత పదేళ్ల నుంచి స్థిరాస్తి క్రయవిక్రయాలు అంతంత మాత్రంగా మారాయి. కరోనా తర్వాత ఏడాది కాలం పాటు లావాదేవీలు కొంత పర్వాలేదనిపించినా.. రెండేళ్ల నుంచి పరిస్థితి మళ్లీ స్తబ్దంగా తయారైంది. ప్రధానంగా ఇళ్ల, ఫ్లాట్స్ విక్రయాలు బాగా పడిపోగా, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లు మాత్రం కొద్దిగా పెరిగాయి. ప్రధానంగా గృహ రుణాల వడ్డీ రేట్లు, స్థిరాస్తుల ధరలు విపరీతంగా పెరగడంతో అమ్మకాలు ఆశించినంత స్థాయిలో జరగడం లేదని తెలుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే స్థిరాస్తి రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఓపెన్ ప్లాట్స్.. నమోదు టాప్

గత ఆర్థిక సంవత్సరంలో ఖాళీ స్థలాల క్రయ విక్రయాలు అత్యధికంగా జరిగినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద 2023–24 ఆర్థిక సంవత్సరం సుమారు 2,68,962 దస్తావేజులు నమోదైతే అందులో 1,33,854 (49.77%) రిజిస్ట్రేషన్లు ఖాళీ స్థలాలకు సంబంధించి కావడం విశేషం. ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు 88,195 (32.79%) జరుగగా, ఇండిపెండెంట్ గృహాలాకు సంబంధించి మాత్రం 46,913 (17.44%) దస్తావేజులు నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

- రిజిస్ట్రేషన్ల శాఖకు హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధి నుంచే భారీగా ఆదాయం సమకూరుతోంది. దస్తావేజుల నమోదు తగ్గినా.. మార్కెట్ వాల్యూలు, భూముల ధరలు పెరగడంతో రాబడి మాత్రం దండిగా పెరిగింది. కరోనా కాలంలో 2020–21 ఆర్థిక సంవత్సరం క్రయవిక్రయాలు మొక్కుబడిగా నమోదు కావడంతో ఆదాయం కొద్దిగా తగ్గు ముఖం పట్టినప్పటికీ ఆ తర్వాత ఎగబాగుతూ వస్తోంది. మొత్తం మీద గత ఆర్థిక సంవత్సరం కేవలం స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ద్వారానే సుమారు రూ.7,476.92 కోట్ల ఆదాయం సమకూరింది. అందులో ఫ్లాట్ దస్తావేజుల నమోదుతో రూ.3875 కోట్లు (51.84%), ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌తో రూ.1,880.74 కోట్లు (25.15%), ఇండిపెండెంట్ ఇళ్ల ద్వారా 1,720.21 కోట్ల (23.01%) ఆదాయ లభించింది.
- రాష్ట్రం మొత్తం మీద 2023–24 ఆర్థిక సంవత్సరం స్థిరాస్తి క్రయవిక్రయాలతోపాటు ఇతరత్రా దస్తావేజల నమోదుతో సుమారు రూ.14,588 కోట్లు ఆదాయం సమకూరితే అందులో అత్యధికంగా 62 శాతం అంటే రూ.8 వేల 874 కోట్లు రాబడి గ్రేటర్‌లోని నాలుగు జిల్లాల నుంచే వచ్చినట్లు తెలుస్తోంది. గ్రేటర్ జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచి రూ.4 వేల 926 కోట్లు, మేడ్చల్ జిల్లా నుంచి రూ.2 వేల 531 కోట్లు, సంగారెడ్డి జిల్లా నుంచి రూ.1,417 కోట్ల ఆదాయం సమకూరింది.

'హజ్ దరఖాస్తుల' నమోదులో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్ర–2024 దరఖాస్తుల ప్రక్రియకు ఆన్‌లైన్ సమస్యలతో తీవ్ర అంతరాయం కలుగుతోంది. దరఖాస్తు చేసుకునే యాత్రికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15న 2024 హజ్ యాత్రకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రాంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్ర హజ్ కమిటీ సర్వర్ డౌన్ ఉండడంతో దరఖాస్తులు అప్‌లోడ్ కావడం లేదని యాత్రికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర హజ్ కమిటీ యాత్రికుల సౌకర్యార్థం హజ్ హౌస్‌లో ఎనిమిది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసింది. 16వ తేదీ నుంచి దరఖాస్తులు అప్‌లోడ్ అవుతున్నా.. మధ్యమధ్యలో సర్వర్ పనిచేయడం లేదు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే వారు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు సమయానికి ఓటీపీ రాకపోవడంతో దరఖాస్తు మధ్యలోనే ఆగిపోతోంది. కేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీ సమన్వయంతో దరఖాస్తుదారులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని యాత్రికులు కోరుతున్నారు. దీనిపై హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి లియాకత్ మాట్లాడుతూ కేంద్ర హజ్ కమిటీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

రుణమాఫీ కాలే!

'కొత్తూరు మండలం రెడ్డిపాలెంలో 110 మంది రైతులు రుణాలు తీసుకోగా 15 మంది రుణాలే మాఫీ అయ్యాయి. నందిగామ పీఏసీఎస్‌లో 44 మంది రుణం తీసుకోగా 18 మందికే మాఫీ అయింది. మేకగూడలో 380 మంది రుణం తీసుకుంటే 241 మందికే మాఫీ జరిగింది. చేగూర్ పీఏసీఎస్‌లో 349 మందికిగానూ 236 మందికే మాఫీకి నోచుకున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల పరిధిలో 19,219 మంది రైతులు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. వీరిలో కేవలం 3,572 మందికే మాఫీ అయింది. మాఫీ కానీ అర్హులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు క్యూ కడుతున్నారు. ఇలా ఇప్పటి వరకు 3,961 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారు'.

- ఆందోళనలో అన్నదాతలు
- బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- స్పెషల్ డ్రైవ్ పేరిట వివరాల సేకరణ
- ఇప్పటి వరకు 3,961 మంది దరఖాస్తు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అర్హత ఉన్నప్పటికీ రుణాలు మాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయశాఖ సేకరిస్తోంది. ఇప్పటికే మండలాల వారీగా నోడల్ అధికారులను నియమించింది. రూ.రెండు లక్షల లోపు రుణాలు మాఫీ కాని రైతుల వివరాలు సేకరించి, ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,961 దరఖాస్తులు అందినట్లు సమాచారం. ఇదిలా ఉంటే బ్యాంకుల్లో ఉన్న రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తమకు ఎందుకు వర్తించలేదని బ్యాంకులు, వ్యవసాయ అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అసలు తమకు ఈ పథకం వర్తిస్తుందా? లేదా అని ఆందోళన చెందుతున్నారు.

మూడు విడతల్లో 87,612 మందికే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పేర్కొంది. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న 49,471 మందికి సంబంధించి రూ.257.19 కోట్లు మాఫీ చేసింది. రెండో విడతలో రూ.లక్షన్నరలోపు రుణాలు తీసుకున్న 22,915 మంది రైతులకు సంబంధించి రూ.218.13 కోట్లు మాఫీ చేసింది. మూడో విడతలో రూ.రెండులక్షల లోపు రుణాలు తీసుకున్న 15,226 మందికి సంబంధించిన రూ.185.40 కోట్లు మాఫీ చేసింది. మూడు విడతల్లో 87,612 మంది రైతులకు సంబంధించి రూ.660.72 కోట్లు మాఫీ అయింది.

గ్రీవెన్స్ సెల్‌కు క్యూ..

బ్యాంకుల్లో అప్పు తీసుకున్న వాళ్లు లక్షల్లో ఉండగా, ఇప్పటి వరకు వేలల్లోనే మాఫీ చేసింది. పట్టాదారు పాసుపుస్తకం, రేషన్‌కార్డు ఉన్న అర్హులకు కూడా రుణాలు మాఫీ కాలేదు. బ్యాంకుఖాతా, ఆధార్ డేటా, పట్టాదారు పాసు పుస్తకం, రేషన్‌కార్డులో దొర్లిన పలు తప్పులను సాకుగా చూపించింది. రైతులంతా ఆందోళన బాటపట్టడంతో చివరికి ప్రభుత్వం దిగొచ్చింది. రైతురుణ మాఫీ కోసం మరోసారి అవకాశం కల్పించాలని నిర్ణయించి, అర్హుల జాబితాను తయారు చేయాల్సిందిగా సూచించింది. దీంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు మండలానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించి, రైతు వేదికల్లో కౌంటర్లు తెరిచారు. అర్హులు వీటికి తరలివస్తున్నారు. తమకు రుణమాఫీ ఎందుకు అమలు చేయలేదని సంబంధిత అధికారులను నిలదీస్తున్నారు.

ఏకకాలంలో మాఫీ చేయాలి

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.రెండు లక్షల లోపు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర రుణాలు తెచ్చి వ్యవసాయం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, సాంకేతిక కారణాలను సాకుగా చూపించి రైతులను మానసిక క్షోభకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కావలి నరసింహ, ఓరుగంటి యాదయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులింగం, అధ్యక్షుడు మాధవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, నీలమ్మ, భరత్‌రాజు, నరసింహ, జిల్లా సమితి సభ్యులు కె.చంద్ర యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, పల్నాటి యాదయ్య, ములుగు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చేసి.. భూములు అప్పగించి!

- ప్రాణం మీదికొచ్చిన రిజిస్ట్రేషన్ల అప్పులు
- రియల్ వ్యాపారం డీలాతో నష్టపోతున్న వ్యాపారులు, రైతులు
- ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో జోరుగా సాగుతున్న వైనం



యాచారం: భూముల రిజిస్ట్రేషన్ కోసం తెచ్చిన అప్పులు ప్రాణం మీదికొస్తున్నాయి. రియల్ వ్యాపారం మోజులో అధిక లాభాలు పొందొచ్చని భ్రమ పడిన రైతులు, వ్యాపారులు వడ్డీ భారానికి కుదేలవుతున్నారు. మార్కెట్‌లో రూ.కోట్లు పలికే భూములను అప్పులు తీర్చేందుకు ఉన్నపలంగా తక్కువ ధరకు విక్రయించి చేతులు కాల్చుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో వడ్డీ, అసలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలున్నాయి.

- యాచారం మండల కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ రైతుకు రూ.1.25 కోట్లు అవసరమై ఓ వడ్డీ వ్యాపారిని ఆశ్రయించారు. ష్యూరిటీగా వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన వ్యాపారి పెట్టారు. దీంతో రైతు తన పేరు మీద ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని వ్యాపారి మీద రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం అక్కడ రూ.80 లక్షలకు పైగా ఎకరం పలుకుతోంది. వందకు రూ.మూడు వడ్డీకి రూ.1.25 కోట్లు అప్పుగా రైతు తెచ్చుకున్నారు. గడువు పూర్తి కావడంతో వడ్డీ వ్యాపారి అప్పు కిందకు రైతు పొలాన్ని ఆక్రమించారు.
- మాడ్గుల మండల కేంద్రానికి చెందిన ఓ రియల్ వ్యాపారికి రూ.25 లక్షల అప్పు ప్రాణం మీదకు తెచ్చింది. అప్పులు ఇచ్చిన వారి నుంచి నిత్యం వేధింపులు వస్తుండడంతో మాల్ మార్కెట్‌లో ఉన్న 250 గజాల ప్లాటును వడ్డీ వ్యాపారికి రిజిస్ట్రేషన్ చేశారు. గడువు దాటినా అప్పు తీర్చకపోవడంతో మార్కెట్ ధర కంటే తక్కువగా ప్లాటు విక్రయించారు. వచ్చిన నగదుతో అప్పు చెల్లించారు. గజానికి రూ.30 వేలు విలువ చేసే ప్లాటు ను రూ.18 వేలకే విక్రయించి నష్టపోయారు.

తాకట్టు కింద రూ.2 వేల కోట్ల భూములు

జిల్లాలో ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో దాదాపు 200 మందికి పైగా రైతులు, రియల్ వ్యాపారులు దాదాపు 300లకు పైగా ఎకరాల వ్యవసాయ భూములు, ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేసి అప్పులు తెచ్చుకున్నారు. గత ప్రభుత్వంలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించడంతో ఇక్కడ రియల్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. రెండేళ్లుగా రియల్ వ్యాపారం డీలా పడడంతో తెచ్చిన అప్పులు రెండింతలవ్వడంతో వడ్డీ వ్యాపారుల పేర్ల మీద బాధితులు రిజిస్ట్రేషన్లు చేశారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోనే రూ.2 వేల కోట్లకు పైగా విలువ చేసే పొలాలు, ప్లాట్లను కుదువ పెట్టారు.

నయానగరిపైనే ఆశలు

రేవంత్‌రెడ్డి సర్కారు ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో నయానగరి ఏర్పాటుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో రియల్ వ్యాపారులు దానిపై గంపెడాశలు పెట్టుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీరాఖాన్‌పేట సమీపంలో నయానగరి శంకుస్థాపనతో ఇప్పుడిప్పుడే రియల్ వ్యాపారం మళ్లీ పురుడు పోసుకుంటుంది. గతేడాది ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్ల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్లాట్ల ధరలు కూడా గతంలో కంటే కొద్దిగా అధికంగానే పెంచి విక్రయిస్తున్నారు.

కఠిన చర్యలు తప్పవు



వడ్డీ వ్యాపారులు అప్పులు చెల్లించాలని రైతులు, రియల్ వ్యాపారులపై ఒత్తిళ్లు చేస్తే సహించేది లేదు. ఫిర్యాదులు ఇస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు సైతం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచన.

– శంకర్‌కుమార్, సీఐ, యాచారం

'రియల్' పుంజుకుంటుంది



సీఎం రేవంత్‌రెడ్డి మీరాఖాన్‌పేట గ్రామ సమీపంలో నయానగరికి శంకుస్థాపన చేయడంతో మళ్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుంది. చాలా మంది రైతులకు అవసరమైతే భూములు, ప్లాట్లు అమ్ముకొని అప్పులు తీర్చుకోమని సలహా ఇచ్చాను.

– చంద్రశేఖర్‌రెడ్డి, రియల్ వ్యాపారి, నందివనపర్తి

అంధులకు చూపునిద్దాం

- నేత్రదానంపై అపోహలు వీడాలి
- ఒక్కరితో ఇద్దరికి కంటి చూపు
- లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్
- సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు



సాక్షి INTERVIEW

ఆమనగల్లు: నేత్రదానంపై ప్రజలు అపోహలు వీడి.. అంధులకు చూపునిచ్చేందుకు ముందుకు రావాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. వ్యక్తి మరణానంతరం నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చు. ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు ప్రభుత్వం నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 15 రోజుల పాటు క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా నేత్రదానంపై ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రి కంటి వైద్య సహాయకులు, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ ఎం.చంద్రశేఖర్‌తో ఇంటర్వ్యూ..

ప్రశ్న: కార్నియా అంధత్వం అంటే ఏమిటి?

జవాబు: కంటిలోని నల్లగుడ్డు ముందుభాగాన్ని కప్పి ఉంచే పారదర్శకమైన పొరను కార్నియా అంటారు. ఇన్‌ఫెక్షన్, గాయాలు, పోషకాహారలోపంతో కార్నియా దెబ్బతిని, చూపు మందగించినా, కోల్పోయినా కార్నియా అంధత్వం అంటారు.

ప్రశ్న: నేత్రదానం ఎవరు చేయవచ్చు?

జవాబు: వ్యక్తి మరణించిన తర్వాత సేకరించిన కళ్లతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చు. ఆరోగ్యవంతమైన ఏ వ్యక్తి అయిన మరణానంతరం నేత్రదానం చేయవచ్చు. కళ్లజోడు ధరించేవారు, క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్నవారు కూడా నేత్రదానం చేయవచ్చు. నేత్రదానం చేసే వ్యక్తులు నేత్రదానం ప్రతిజ్ఞ పత్రం నింపాలి.లేదా మరణానంతరం కుటుంబ సభ్యులు అంగీకారంతో నేత్రదానం చేయొచ్చు.

ప్రశ్న: నేత్రదానాన్ని అంగీకరిస్తే ఎలా సేకరిస్తారు?

జవాబు: నేత్రదానం అంగీకరించిన వారు మరణానంతరం సమాచారం అందిస్తే ఐ బ్యాంక్ సిబ్బంది ఇంటికి వచ్చి కళ్లను సేకరిస్తారు. మరణించిన ఆరు గంటల లోపు కార్నియాను సేకరించవచ్చు.

ప్రశ్న: నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పక్షోత్సవాల సందర్భంగా ర్యాలీలు, విద్యార్థులకు పోటీలు పెడుతూ అవగాహన కల్పిస్తున్నాం. అలాగే లయన్స్ క్లబ్‌ల ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతిఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలి.

పోగొట్టుకున్న నగల బ్యాగు అప్పగింత



వనజకు బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న డీఐ గౌరునాయుడు, క్రైం సిబ్బంది

మీర్‌పేట: ఆటోలో ప్రయాణిస్తూ పోగొట్టుకున్న 25 తులాల బంగారు ఆభరణాల బ్యాగును మీర్‌పేట పోలీసులు బాధితులకు అప్పగించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గౌరునాయుడు కథనం ప్రకారం.. జిల్లెలగూడ గాయత్రినగర్‌కు చెందిన మడ్డి వనజ కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యం నిమిత్తం రెండ్రోజుల క్రితం సరూర్‌నగర్ శారదానగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. అనంతరం సోమవారం తిరిగి ఇంటికి వచ్చేందుకు ఆటో ఎక్కారు. ఇంటికి వచ్చేసరికి 25 తులాల నగలున్న బ్యాగు కనిపించకపోవడంతో వెంటనే మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నగలున్న బ్యాగు కర్మన్‌ఘాట్ క్రాంతినగర్ గ్రౌండ్ వద్ద ఆటోలో నుంచి పడిపోవడంతో, వెనుక వస్తున్న మరో ఆటో డ్రైవర్ బ్యాగును తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్ ఇంటికి వెళ్లి బ్యాగును స్వాధీనం చేసుకుని మంగళవారం వనజకు అందజేశారు. ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోపే దర్యాప్తు చేపట్టి బంగారు ఆభరణాలను తిరిగి అప్పగించినందుకు సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ నాగరాజు, డీఐ గౌరునాయుడులు అభినందించారు.

లాకప్‌డెత్ కాదు.. గుండెపోటుతోనే మృతి

- శాట్ ఒపీనియన్‌లో వైద్యుల వెల్లడి
- ఆదిబట్ల పోలీసులకు ఊరట

ఇబ్రహీంపట్నం రూరల్: లాకప్ డెత్‌లో హాజీ(43) అనే వ్యక్తి మృతి చెందలేదని, ఆయన గుండెపోటుతోనే మరణించినట్లు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు దివ్య వెల్లడించారు. మృతదేహానికి మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం గదిలో శవ పంచనామా నిర్వహించారు. బాబానగర్‌కు చెందిన గోవింద్, నరేశ్, హాజీలు సోమవారం ఆదిబట్ల ఠాణా సమీపంలోని కుర్మల్‌గూడ టీ జంక్షన్ వద్ద దొంగతనం చేయడానికి వచ్చినట్లు భావించిన స్థానికుడు మధు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముగ్గురిని పీఎస్‌కి తరలిస్తున్న సమయంలో హాజీకి గుండెపోటు వచ్చి.. ఆస్పత్రికి తరలించగా మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై హాజీ అన్న కుమారుడు మహ్మద్ ఖాజా మధుపై ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. హాజీకి గతంలోనే గుండె సంబంధిత శస్త్ర చికిత్స జరిగిందని కుటుంబీలకు చెప్పారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఏమి లేదని కేసుపై పూర్తి విచారణ చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీ చెందిన సూరమోని శ్రీశైలం, ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన భీష్య రాజులు కొంత కాలంగా పట్టణంలో వైన్స్ దుకాణాల ఎదుట.. రైల్వే, బస్టాండ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాల హ్యాండిల్స్‌ను విరగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగిలించిన వాహనాలకు అమ్ముకొని జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ముడావత్ కమల్యా నాయక్ తన వాహనం చోరీ జరగడంతో ఈనెల 8న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న శ్రీశైలం, రాజులు పట్టుకొని అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్ఐ శరత్‌కుమార్, సిబ్బంది కృష్ణ, శంకరయ్య, మహేష్, రాజేష్, రఫీలు చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించినట్లు సీఐ తెలిపారు.


సెప్టెంబర్ 2న బీసీ మహాధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద సెప్టెంబర్ 2న బీసీ మహాసభ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమసంఘం కార్యాలయంలో మంగళవారం బీసీ మహాధర్నా పోస్టర్లను బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సెప్టెంబర్ 2న కల్వకుర్తిలో నిర్వహించే బీసీ మహాధర్నాకు పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మాడ్గుల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు మాట్లాడుతూ.. మాడ్గుల మండలాన్ని షాద్‌నగర్ కార్మిక శాఖలో కలపడంతో 100 కిలో మీటర్ల దూరం ఉందన్నారు. పరిపాలన పరంగా మాడ్గుల ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నందునా.. మండలాన్ని షాద్‌నగర్ కార్మిక శాఖ నుంచి తొలగించి ఇబ్రహీంపట్నం కార్మిక శాఖకు మార్చాలని కోరామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బ్రహ్మయ్య, ముస్తాఫా, ఆనంద్, నరసింహ, వెంకటయ్య, ఈదయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చంటిపాపతో తల్లి అదృశ్యం

యాచారం: చంటి పాపతో ఓ తల్లి అదృశ్యమైన సంఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కందుకూరు మండల పరిధిలోని గొట్టిలగడ్డ తండాకు చెందిన రాజు, అఖిల దంపతులు. సోమవారం అఖిల తన ఏడాది వయసున్న కూతురుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాజు చుట్టు పక్కల గ్రామాల్లో, తన బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



ఇబ్రహీంపట్నం డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఇబ్రహీంపట్నం: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఇబ్రహీంపట్నం డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాజమాన్యం పని భారం వేధింపులు, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మికుల ఆర్థిక సమస్యలు, పీఆర్సీ, మహాలక్ష్మి టికెట్ల వల్ల కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ.. జేఏసీ నేతలు నిరసన చేపట్టారు.

అక్రమ నిర్మాణాన్ని గుర్తించిన అధికారులు



పీర్లకుంటను పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

నందిగామ: మండల పరిధిలోని మొదల్లగూడ, ఈదులపల్లి శివారులోని పీర్లకుంటను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేశ్వర్, ఇరిగేషన్ ఏఈ రవీందర్‌రెడ్డి కుంట కట్టను, శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను పరిశీలించారు. అనంతరం కుంటలోకి వచ్చే కాల్వపై వెంచర్ నిర్వాహకులు గోడను నిర్మించారని గుర్తించారు. వెంటనే ప్రహరీ కూల్చేయాలని వెంచర్ నిర్వాహకులను ఆదేశించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉరేసుకొని వలస కూలీ బలవన్మరణం




నర్సింహ (ఫైల్)

కడ్తాల్: కుటుంబ సమస్యలతో ఉరేసుకొని వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద సోమవారం రాత్రి వెలుగు చూసింది. మంగళవారం సంఘటనకు సంబంధించి సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ గ్రామానికి చెందిన కుక్కల నర్సింహ(40), అతని భార్య సుమిత్ర ఇద్దరు పిల్లలతో కలిసి మండల కేంద్రానికి రెండేళ్ల క్రితం వలస వచ్చి స్థానిక చెంచుకాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. సోమవారం భార్యాభర్తలు మండల కేంద్రానికి చెందిన కోసికే వెంకటేశ్‌కు చెందిన పశువుల షెడ్డు వద్దకు కూలీ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటలకు కుటుంబ సమస్యల విషయంలో ఇద్దరు గొడవ పడడంతో సుమిత్ర భర్తకు చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో క్షణికావేశానికి గురైన నర్సింహ సోమవారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో అక్కడే ఉన్న తాడుతో పశువుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి బావమరిది నల్లపోతుల నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పొలంలో ఉరేసుకొని మృత్యువాత



కుమార్ (ఫైల్)

మొయినాబాద్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చిలుకూరులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగెరి కుమార్(42) మృగవని జాతీయ పార్కులో దినసరి కూలీగా పనిచేసేవాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం మరింత క్షీణించడంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు ఇంటి నుంచి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య శారద, కొడుకు అభినవ్, కూతురు సుచిత ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారులో వచ్చి.. బ్యాటరీలు ఎత్తుకెళ్లి

అర్ధరాత్రి గ్రామాల్లో పార్కు చేసిన వాహనాల్లో బ్యాటరీల చోరీ

మొయినాబాద్: అర్ధరాత్రి సమయంలో బ్యాటరీ దొంగలు హల్ చల్ చేశారు. కారులో వచ్చి ఇళ్ల ముందు, రోడ్ల పక్కన పార్కు చేసిన వాహనాల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాతి దుండగులు నంబర్ ప్లేట్ లేని కారులో వచ్చి ఎలుకగూడ, రెడ్డిపల్లి, పెద్దమంగలారం గ్రామాల్లో పార్కుచేసిన వాహనాల 9 బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఎలుకగూడలో రాజు, శ్రీనివాస్‌లకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీలు, వెంకటేశ్‌కు చెందిన ఆటో బ్యాటరీ, టి.జగదీష్‌కు చెందిన కారు బ్యాటరీ దొంగలించారు. రెడ్డిపల్లిలో కమల్, ఇంద్రసేనారెడ్డిలకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీలు, ఆంజనేయులు ఆటో బ్యాటరీ ఎత్తుకెళ్లారు. పెద్దమంగళారంలోనూ రెండు కార్ల బ్యాటరీలు దొంగిలించారు. ఉదయం వాహనాల బ్యాటరీలు లేకపోవడంతో బాధితులంతా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.